సాక్షి కరీంనగర్

శనివారం । 14 । అక్టోబర్ । 2023

పూల జాతర

పుట్టింటికి వచ్చిన ఆడపడుచుల్లా..
రెక్కలు విచ్చిన సీతాకోకచిలుకల్లా..
కరుణించి కాపాడే అమ్మవారిలా..
'బతుకమ్మ'రానే వచ్చింది..
ఊరూవాడా భక్తిప్రపత్తులు నింపనుంది..
శనివారం 'ఎంగిలిపూల' వేడుకలు
ప్రారంభంకానున్నాయి.
సద్దుల బతుకమ్మతో సంబురాలు
ముగియనున్నాయి.



న్యూస్‌రీల్

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లోని 33/11 కేవీ ఎస్‌ఆర్ఆర్ కళాశాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నెలవారి విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యానగర్, జ్యోతినగర్, భాగ్యనగర్, సంతోష్‌నగర్, పాత లేబర్ అడ్డా, మామిడితోట, ఆర్టీసీ వర్క్‌షాపు వెనుకప్రాంతం, ఆదిత్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్- 2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. అదేవిధంగా 132/11 కేవీ వావిలాలపల్లి, 33/11 కేవీ బ్యాంక్‌కాలనీ, వాటర్ వర్క్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ల విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బ్యాంక్ కాలనీ, మెహర్‌నగర్, వరలక్ష్మీనగర్, జగిత్యాల రోడ్, కోర్టు రోడ్, సీతారాంపూర్, కాపువాడ, ఆటోనగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, పోచమ్మవాడ, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

కరీంనగర్ రూరల్ డివిజన్‌లో..

సబ్‌స్టేషన్లలో విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 33/11 కేవీ శాతవాహన యూనివర్సిటీ, నగునూర్, బద్దిపల్లి, ఆసిఫ్‌నగర్, ఖాజీపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ డివిజన్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు.

డిప్యూటీ లేబర్ కమిషనర్‌గా బాధ్యతలు



కరీంనగర్: ఉమ్మడి జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్‌గా డాక్టర్ కె.సామ్యూల్ జాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్‌లోని కార్యాలయ సిబ్బందితోపాటు పలువురు ఆయనకు స్వాగతం పలికి, సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఫ్యాక్టరీలు, ఇటుకబట్టీలు, హోటళ్లలో 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల్లో గుర్తించిన బాల కార్మికులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపిస్తున్నామని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, 8 గంటలు మాత్రమే పని చేయించుకోవాలన్నారు. కార్మిక సంక్షేమ నిధి ద్వారా ప్రవేశపెడుతున్న పథకాలను భవన నిర్మాణ రంగ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్, జగిత్యాల జిల్లాల అసిస్టెంట్ లేబర్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా కోర్టులకు సంబంధించి సీనియర్ న్యాయవాదులు నలుగురిని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమించారు. కరీంనగర్ రెండో అదనపు జిల్లా కోర్టుకు ఆరెల్లి రాములు, ఫ్యామిలీ కోర్టుకు జూలూరు శ్రీరాములును నియమించారు. కరీంనగర్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న గౌరు రాజిరెడ్డిని, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న గడ్డం లక్ష్మణ్‌లను తిరిగి రెండోసారి నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నాయబ్ తహసీల్దార్లకు పోస్టింగ్

కరీంనగర్ అర్బన్: ఇటీవల నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి పొందిన ఆర్‌ఐలకు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ బి.గోపి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాకేశ్‌కు ఎన్‌టీ ఎపిక్ మానకొండూరు, సురేందర్‌కు ఎన్‌టీసీఎస్ కరీంనగర్, ఉషకు ఎన్‌టీసీఎస్ గంగాధర, అరుణ్‌ను గంగాధర నాయబ్ తహసీల్దార్‌గా నియమించారు.

నేటి నుంచి కాలేజీలకు దసరా సెలవులు

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కాలేజీలకు శనివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటిస్తూ వీసీ ప్రొఫెసర్ మల్లేశం ఉత్తర్వులు జారీ చేశారని రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో తిరిగి 25వ తేదీ నుంచి యథావిధిగా తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు సమాచారం అందించాలని ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు సూచించారు.

అధినేతల జోరు



ఉమ్మడి జిల్లాలో ప్రచారం ప్రారంభించనున్న నేతలు

- 15న హుస్నాబాద్, 17న సిరిసిల్లకు సీఎం కేసీఆర్
- హుస్నాబాద్ సభలోనే పార్టీ మేనిఫెస్టో వివరాల వెల్లడి
- 16న హుజూరాబాద్‌కు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- 18న జగిత్యాలకు రాహుల్, ప్రియాంక, కరీంనగర్‌కు కేటీఆర్
- కాంగ్రెస్ బస్సు యాత్ర అదేరోజు ప్రారంభం
- అర్వింద్ పర్యటనతో జగిత్యాల బీజేపీలో కొత్త ఊపు

జంగ్ తెలంగాణ



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో ఎన్నికలవేడి రాజుకుంటోంది. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతల పర్యటనల తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 15న పార్టీ ముఖ్య నేతలందరూ ఎన్నికల సమరశంఖం పూరించేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్, బీఎస్పీ తెలంగాణ చీఫ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పర్యటించనున్నారు.

సీఎం సభతో మొదలు..

అభ్యర్థుల ప్రకటన మొదలు ప్రచారంలో ముందున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రచారాన్నీ ముమ్మరం చేస్తున్నారు. ఈనెల 15న ఉదయం ప్రగతిభవన్‌లో ఉమ్మడి జిల్లాలోని 13 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ-ఫారాలను అందజేస్తారు. ఆతర్వాత పార్టీకి ఎంతో కీలకమైన మేనిఫెస్టోను అక్కడే రిలీజ్ చేస్తారు. అనంతరం హుస్నాబాద్ బయల్దేరుతారు. పార్టీకి సెంటిమెంట్‌గా వస్తున్న హుస్నాబాద్ సభలోనే మేనిఫెస్టోలోని హామీలు రాష్ట్ర ప్రజలకు వివరిస్తారు. హుస్నాబాద్ జనసమీకరణ బాధ్యతలు కరీంనగర్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్న అనిల్‌గౌడ్‌కు అధిష్టానం అప్పగించింది. 17న సిరిసిల్ల, వచ్చేనెల 3న కోరుట్ల, 7న పెద్దపల్లి, మంథనిలో జరిగే సభల్లో సీఎం మాట్లాడుతారు.

18న గంగుల ప్రచారంలో కేటీఆర్

ఈనెల 18న మంత్రి గంగుల కమలాకర్ ప్రచారం ప్రారంభించ నున్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సిరిసిల్ల నుంచి రానున్న కేటీఆర్‌కు మంత్రి గంగుల కమలాకర్ పార్టీ శ్రేణులు స్వాగతం పలుకుతారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించి, భారీ ఊరేగింపుతో సభా ప్రాంగణానికి వెళ్తారు. అక్కడ కేటీఆర్ ప్రసంగిస్తారు. క్రమంగా మిగిలిన 12 నియోజకవర్గాల్లోనూ కేటీఆర్ పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

కొండగట్టు నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర..

జగిత్యాల జిల్లా కొండగట్టు నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర ప్రారంభించనుంది. ఇందుకోసం రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ రానున్నారు. కాంగ్రెస్ జిల్లాల పర్యటనకు ఉద్దేశించిన బస్సు పర్యటనలు విజయవంతం కావాలని కోరుతూ కొండగట్టు అంజన్న ఆశీర్వాదాలు తీసుకోవాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే 18న రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ జగిత్యాలకు రానున్నారు. పార్టీ అగ్రనేతలతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ లీడర్లు ప్రచారం ముమ్మరం చేయనున్నారు.

రాజ్‌నాథ్, బండి, అర్వింద్..

బీజేపీలో జోష్ నింపేందుకు బీజేపీ అగ్రనాయకత్వం కేంద్ర నాయకులు, కేంద్రమంత్రులు ఉమ్మడి జిల్లాకు రానున్నారు. ఈనెల 16న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హుజూరాబాద్‌లో ప్రచారం ప్రారంభించనున్నారు. కరీంనగర్ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కూడా రాజ్‌నాథ్ పర్యటన అనంతరం కరీంనగర్‌లో ప్రచారం స్టార్ట్ చేస్తారని సమాచారం. ఇక కోరుట్ల అసెంబ్లీ స్థానంపై కన్నేసిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ శుక్రవారం పర్యటన పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపింది. వీరితోపాటు బీఎస్పీ అభ్యర్థులకు మద్దతుగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సైతం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు.

ఆ ఆరుగురు ఎవరు?

- నగరంలోని కిసాన్‌నగర్‌లో ఖాళీ స్థలం కాజేసేందుకు యత్నం
- తప్పుడు పత్రాలతో ఇంటి నంబర్లకు దరఖాస్తు
- తిరస్కరించిన అధికారులు
- బాధ్యులపై చర్యలేవి?
- బల్దియాలో ఇంటి నంబర్ల నయా దందా



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని కిసాన్‌నగర్ శివాజీనగర్‌లోని ఖాళీ స్థలాన్ని కాజేసేందుకు ఇంటి నంబర్లు సృష్టించేందుకు ప్రయత్నించడం చర్చనీయాంశమైంది. తప్పుడు పత్రాలతో ఇంటి నంబర్ల కోసం వచ్చిన 6 దరఖాస్తులను తిరస్కరించినట్లు నగరపాలక సంస్థ అధికారులు ప్రకటించారు. ఇంతవరకు బాగానే ఉన్నా తప్పుడు పత్రాలతో వచ్చినవారెవరు, వారిపై చర్యలు తీసుకోకపోవడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ వ్యవహారం వెనక ఉన్న పెద్దల ఒత్తిడి కారణంగానే చర్యలకు వెనకడుగు వేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

భూమి విలువ రూ.20 కోట్లు..

కరీంనగర్‌లోని శివాజీనగర్ సర్వే నంబర్ 54లో ఉన్న ఎకరానికి పైగా ఖాళీ స్థలాన్ని కాజేసేందుకు నగరపాలక సంస్థ ద్వారా ఇంటి నంబర్లు పొందేందుకు కుట్ర పన్నడం తెలిసిందే. రూ.20 కోట్ల విలువైన ఈ భూమిని ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రణాళికలో భాగంగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని 'సాక్షి' బహిర్గతం చేయడంతో అధికారులు ఇంటి నంబర్ల కోసం వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తులను తిరస్కరించినట్లు ప్రకటించారు. తమ విచారణలో ఖాళీ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు లేవని, తప్పుడు పత్రాలతో దరఖాస్తు చేసుకున్నట్లు తేలిందని పేర్కొన్నారు. కానీ, బాధ్యులను వదిలేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తప్పుడు పత్రాలతో దరఖాస్తు చేసుకున్న ఆ ఆరుగురు ఎవరు? వారి వెనకున్న పెద్దలు ఎవరనేది విచారణ జరిపితే వెల్లడవుతుంది.

వివరాలు ఆన్‌లైన్‌లో..

దరఖాస్తుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయి. వాటి ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవడం సులువు. కానీ, ఆ దిశగా నగరపాలక సంస్థ అధికారులు ఆలోచిస్తున్నట్లు కనిపించడం లేదు. నగరంలో ఇంటి నంబర్లతో ఖాళీ స్థలాలను సొంతం చేసుకొనే నయా దందాపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. బల్దియాకు చెందిన కొంతమంది ఉద్యోగులు, అధికారుల సహకారంతోనే ఏళ్లుగా ఈ తతంగం నడుస్తోందని పలువురు నగరవాసులు ఆరోపిస్తున్నారు.

మరోసారి గెలిపించండి.. సేవ చేస్తా

- బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్



మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కొత్తపల్లి(కరీంనగర్): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 60 రోజులు తన గెలుపు కోసం కష్టపడితే.. 60 నెలలు మీకు అండగా నిలుస్తానని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తనను నమ్మి మూడుసార్లు గెలిపిస్తే కరీంనగర్ నియోజకవర్గ ప్రజల గొంతుకనయ్యానని తెలిపారు. మరోసారి ఆశీర్వదిస్తే మీకు సేవ చేస్తానని పేర్కొన్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలంలోని చింతకుంటలో శుక్రవారం యువకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కాళేశ్వరం జలాలతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 3 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పరిశ్రమను స్థాపించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఎలగందుల నుంచి మానేరు వంతెనపై గన్నేరువరం మీదుగా హైదరాబాద్‌కు రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల రూపంలో మళ్లీ ఆంధ్రా నాయకులు వస్తున్నారని, సీఎం కేసీఆర్ ఓడిపోతే తెలంగాణను మళ్లీ ఆంధ్రలో కలిపే ప్రయత్నం చేస్తారని ఆరోపించారు. అనంతరం నాయకులు తాము ఈ ఎన్నికల్లో మంత్రి కమలాకర్‌కు ఓటేస్తామని ప్రమాణం చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు తిరుపతినాయక్, మనోహర్, రమేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ సభాస్థలి పరిశీలన

కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఈ నెల 18న కరీంనగర్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని రాంనగర్‌లో గల మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభ స్థలాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ శుక్రవారం పరిశీలించారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆశీర్వాద సభను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. మేయర్ వై.సునీల్‌రావు, కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు కులదీప్ వర్మ, వెంకట్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మంద రాయమల్లు తదితరులున్నారు.

కాంగ్రెస్, బీజేపీల చరిత్ర ప్రజలకు తెలుసు

- ముచ్చటగా మూడోసారి కేసీఆరే సీఎం
- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్



మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీల చరిత్ర ప్రజలకు తెలిసిందేనని, కొత్తగా వాటి గురించి తెలుసుకోవాల్సింది ఏమీ లేదని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్‌లు ఎన్నికల ముందు ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఎత్తుగడలతో పసలేని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఇంటింటికీ అందిస్తుంటే కాంగ్రెస్, బీజేపీలకు మింగుడు పడటం లేదన్నారు. ఎంపీ సంజయ్ చేసిందేమిటో చెప్పి ఓట్లు అడగాలని సూచించారు. యువతను రెచ్చగొట్టడం, ఎన్నికల్లో లబ్ధి పొందడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలుచేసినా ప్రజలు నమ్మబోరని, మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ సీఎం అవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, తిరుపతి, పెండ్యాల మహేశ్, మేకల చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

విధులను విస్మరిస్తే వేటే



ఏర్పాట్ల వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ గోపి

- పొరపాట్లు లేకుండా ఎన్నికల విధులు
- జిల్లా ఎన్నికల అధికారి బి.గోపి

కరీంనగర్ అర్బన్: ఎన్నికల విధులను విస్మరిస్తే వేటు తప్పదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.గోపి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేని విధంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ రోజున ఒక్కరు పొరపాటు చేసినా దాని ఫలితానికి జిల్లా మొత్తం బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎటువంటి పరిస్థితుల్లో పోలింగ్ మెటీరియల్‌తో ప్రయాణిస్తున్న వాహనాన్ని ఆపడం, వాహనాన్ని వదిలి వెళ్లడం వంటి చర్యలు చేపట్టరాదని అన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల విధివిధానాలను సూచించే పుస్తకాలను పవిత్ర గ్రంథాలుగా భావించి పూర్తిగా చదివాలని సూచించారు. జెడ్ ప్లస్ క్యాటగిరి ఉన్న అభ్యర్థులు పోలింగ్ బూత్‌లోకి వచ్చేప్పుడు వారి వెంట సివిల్ డ్రెస్‌లో కనబడని విధంగా వెపన్ వెంట తీసుకురాగలిగే ఒక్క భద్రతా సిబ్బందిని మాత్రమే లోనికి అనుమతించాలని తెలిపారు. అనంతరం పోలింగ్ మెటీరియల్, వీవీ పాట్, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్‌లపై అవగాహన కల్పించారు. సమావేశంలో కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్, డీఎంవో పద్మావతి, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, సీపీవో కొమురయ్య, జిల్లా ట్రెజరీ ఉపసంచాలకులు నాగరాజు, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, తహసీల్దార్లు రమేశ్, రాజేశ్,నవీన్ పాల్గొన్నారు.

కాల్‌సెంటర్ తనిఖీ

ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.గోపి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్నవారెందరు, ఎవరెవరికి విధులు కేటాయించారో రిజిష్టర్‌ను పరిశీలించారు. అధికారులను వివరాలు ఆరా తీశారు. హెల్ప్‌లైన్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ సముదాయం చుట్టూ పరిశీలించారు. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని, ప్రభుత్వపరంగా ఎలాంటి పోస్టర్లు ఉండరాదని కలెక్టరేట్ ఏవోకు సూచించారు. సీపీవో కొమురయ్య, డీయం సివిల్ సప్లయిస్ రజనీకాంత్ ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ సి.రాజు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు అడిషనల్ డీసీపీ(పరిపాలన) సి.రాజు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ, ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నిష్పక్షపాతంగా, ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని అన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిర్వహించే విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పట్టుబడిన వారిపై తీసుకునే చర్యల గురించి వివరించారు. రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలన్నారు. నియమావళి అమలులో తప్పిదాలు జరగకుండా అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సందేహం తలెత్తితే సంబంధిత పై అధికారులకు తెలిపి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, రామచంద్రరావు, శ్రీనివాస్, కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి తహసీల్దార్లు రమేశ్, నవీన్, రాజేశ్, ఎంపీడీవో దివ్యదర్శన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.16.69 లక్షలు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ రాజు

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని టూటౌన్ పరిధిలో గల తెలంగాణ చౌరస్తా వద్ద శుక్రవారం భారీగా నగదు పట్టుబడింది. అడిషనల్ డీసీపీ రాజు టూటౌన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంబంధిత వివరాలు వెల్లడించారు. పోలీసులు ఎన్నికల విధుల్లో భాగంగా తెలంగాణ చౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అల్గునూర్‌కు చెందిన చిందం పవన్‌కల్యాణ్ ఓ బ్యాగుతో అనుమానంగా తిరుగుతుండటంతో ఆపి, తనిఖీ చేశారు. అందులో రూ.16.69 లక్షలు దొరకడంతో సీజ్ చేశారు. నగదును ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో టౌన్ ఏసీపీ నరేందర్, టూటౌన్ సీఐ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి బీసీల మహాసభకు తరలిరండి



కరీంనగర్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ నెల 15న హైదరాబాద్ కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో నిర్వహించే బీసీల మహాసభకు తరలిరావాలని సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహాసభలో బీసీలకు రావాల్సిన సీట్లు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగోజు శ్రీనివాస్, చిగుర్ల శ్రీనివాస్, నితిన్, రాజు, నరేందర్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే వేగవంతం చేయాలి

- డీఏవో వాసిరెడ్డి శ్రీధర్



జమ్మికుంట(హుజూరాబాద్): డిజిటల్ క్రాప్ సర్వే వేగవంతం చేయాలని డీఏవో వాసిరెడ్డి శ్రీధర్ అన్నారు. జమ్మికుంట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా, మండలంలోని మాచనపల్లి, జగ్గయ్యపల్లి, పెద్దంపల్లి, కేశవపూర్, అబాది జమ్మికుంట గ్రామాల్లో డిజిటర్ సర్వే ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. జమ్మికుంట మండలంలో 22 వేలు ఎకరాల్లో పంటలు వేయగా 10 వేల ఎకరాలకు సంబంధించి డిజిటర్ సర్వే చేశామని పేర్కొన్నారు. మాచనపల్లిలో పచ్చి వడ్లను విక్రయిస్తుండగా.. ఆరబెట్టి, మద్దతు ధరకు విక్రయించాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కొత్తపల్లి(కరీంనగర్): స్థానిక అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో సత్తాచాటి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఆర్.కార్తీక్, ఎస్.అజయ్, జి.అవిమణీశ్వర్‌రెడ్డి, బి.శివాజీచారి, జి.మణిచంద్, జి.సిరిశరణ్‌లను శుక్రవారం ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

రూ.8.90 లక్షలు పట్టివేత

కరీంనగర్ క్రైం: కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు రూ.8.90 లక్షలు పట్టుకున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా వన్‌టౌన్ పరిధిలో శుక్రవారం తనిఖీలు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి వద్ద రూ.6.90 లక్షలు, మరో వ్యక్తి వద్ద రూ.2 లక్షలు పట్టుకొని, స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

కరీంనగర్ క్రైం: కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 9 మంది పాత నేరస్తులను శుక్రవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి పూల పండుగ

- తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ
- ఆటపాటలతో సందడి చేయనున్న మహిళలు, యువతులు



విద్యానగర్(కరీంనగర్)/కరీంనగర్‌కల్చరల్: మన రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు తీరొక్క పూలతో, రకరకాల పిండి వంటలతో గౌరీదేవిని పూజించడం ఆనవాయితీ. ఆడపడుచులందరూ ఒక్కచోట చేరి, ప్రకృతిలో లభించే రకరకాల పూలతో బతుకమ్మలు పేర్చి, ఆడిపాడతారు. తర్వాత వాటిని దగ్గరలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తారు. నేడు ఎంగిలిపూల బతుకమ్మతో మొదలయ్యే వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

బతుకమ్మ అంటే..

బతుకమ్మ అంటే పూలతో కూడిన అమరిక అని అర్థం. వివిధ రకాల పూలతో కొన్ని వరుసలు పేరస్తారు. మధ్యలో పసుపుతో బొడ్డెమ్మను చేస్తారు. బొడ్డెమ్మను కొందరు దుర్గామాతగా కొలుస్తారు. బతుకు అంటే తెలుగులో జీవించే లేదా జీవితం, అమ్మ అంటే తల్లి అని అర్థం. రెండు అర్థాలు కలిసేలా బతుకమ్మ అని అంటారు.

తొమ్మిది రోజులు ఇలా..

బతుకమ్మ వేడుకల్లో భాగంగా తొలిరోజు ఎంగిలి పూలు, రెండోరోజు అటుకుల, మూడోరోజు ముద్ద పప్పు, నాలుగోరోజు నాన బియ్యం, ఐదోరోజు అట్ల, ఆరోరోజు అలిగిన, ఏడోరోజు వేపకాయల, ఎనిమిదో రోజు వెన్నముద్దల, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ పేరిట ఉత్సవాలు జరుగుతాయి.

ఎన్నికలతో అధికారికంగా నిర్వహణకు బ్రేక్

2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. అప్పటినుంచి ప్రభుత్వ పరంగా జిల్లా అధికారులు అధికారికంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. కానీ, ఈ ఏడాది ఎన్నికల కోడ్ రావడంతో అధికారిక సంబురాలకు బ్రేక్ పడింది.

స్వయంపాలనలో అన్నివర్గాల్లో సంతోషం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్
- బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



రవీందర్‌ను ఆహ్వానిస్తున్న మంత్రి కమలాకర్

కరీంనగర్‌రూరల్: బీఆర్ఎస్‌లో చేరిన యువత భవిష్యత్ కాపాడే బాధ్యత తనదేనని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లోని ఓ గార్డెన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బేడ బుడగ జంగాల యూత్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రవీందర్‌తోపాటు దుర్శేడ్, దుబ్బపల్లి, గోపాల్‌పూర్, మందులపల్లి, నల్లగుంటపల్లి తదితర గ్రామాల్లోని కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కార్యకర్తలు, యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువాలను కప్పి, ఆహ్వానించారు. సమైక్య పాలనలో ప్రజలందరూ అరిగోస పడ్డారని, తెలంగాణ స్వయంపాలనలో అన్నివర్గాలు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. కోట్లాది రూపాయలతో గ్రామాలను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. తనను మరోసారి గెలిపించాలని కోరారు. ఎంపీపీ టి.లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వి.నారాయణ, కరీంనగర్, దుర్శేడ్ సింగిల్‌విండోల చైర్మన్లు పి.శ్యాంసుందర్‌రెడ్డి, జి.నర్సయ్య, సర్పంచ్‌లు జె.నర్సయ్య, డి.రమణారెడ్డి, ఉపసర్పంచ్‌లు శ్రీకాంత్, ఎస్.సంపత్‌రావు, ఎంపీటీసీ సభ్యులు బి.తిరుపతి, రాజ్యలక్ష్మి, ఆర్.లక్ష్మి, టీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

'విలువలు, సేవలతో కూడినది వైద్యం'



పేషెంట్‌తో మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్‌టౌన్: వైద్యం అంటే విలువలు, సేవలతో కూడుకున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లోని రెనె ఆస్పత్రిలో దవాఖానా చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి తల్లి జ్ఞాపకార్థం శ్రీలక్ష్మీ మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 మంది నిరుపేదలకు ఉచిత మోకీలు ఆపరేషన్ చేశారు. శుక్రవారం వారందరికీ మంత్రి చేతులమీదుగా పండ్లు పంపిణీ, ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లి పేరిట ఏటా పేద ప్రజలకు లక్షల రూపాయల విలువైన ఆపరేషన్లు ఉచితంగా చేయడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ.. తన తల్లిపేరుపై పేదలకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తన సతీమణి డాక్టర్ రజనిప్రియదర్శిని సహకారంతో శస్త్రచికిత్సలు విజయవంతంగా చేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కార్పొరేటర్ మేచినేని వనజ, హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రాచారి, వైద్యులు మనీష్, నిఖిల్‌లక్ష్మణ్, దామోదర్‌రెడ్డి, దినకర్, దీక్షిత్ బొజ్జ, యోగేందర్, కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, మేకల అరవింద్‌బాబు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు బతుకమ్మ వేడుకలు



వేడుకలు ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. పెద్ద బతుకమ్మ ఆకట్టుకోగా.. లెక్చరర్లు, విద్యార్థినులు ఆటపాటలతో సందడి చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

కరీంనగర్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కరీంనగర్ కోర్టు తీర్పునిచ్చింది. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టినట్లు కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. న్యాయమూర్తి ఓ వ్యక్తికి 10 రోజుల జైలు, రూ.2,500ల జరిమానా, మరో వ్యక్తికి 3 రోజుల జైలు, రూ.1,500 జరిమానా, మరో 16 మందికి రూ.27,500 జరిమానా విధించారన్నారు. 137 వాహనాలకు ఏర్పాటు చేసిన బ్లాక్ ఫిలిమ్స్ తొలగించి, సంబంధిత వ్యక్తులకు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత



జనార్దన్ రెడ్డి (ఫైల్)

చొప్పదండి: మండలంలోని రెవెల్లికి చెందిన కాసర్ల జనార్దన్ రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. మృతదేహాన్ని ఆయన అల్లుడు కర్ర శ్యాంసుందర్‌రెడ్డి గోపాల్‌రావుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చలిమెడ ఆనందరావు మెడికల్ కళాశాలకు అప్పగించారు. కార్యక్రమంలో గోలి మధుసూదన్ రెడ్డి, మోర భద్రేశం, కొడిమ్యాల వెంకటరమణ, కర్ర ప్రభాకర్ రెడ్డి, బుర్ర మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో జీవితఖైదు

- మరొకరికి మూడేళ్ల జైలు

సిరిసిల్లక్రైం/చందుర్తి(వేములవాడ): హత్య కేసులో ఒకరికి జీవితఖైదు, మరొకరికి మూడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రిన్సిపల్ జడ్జి ప్రేమలత శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాలు. 2018 ఫిబ్రవరిలో చందుర్తి మండలం రామారావుపల్లికి చెందిన లింగంపల్లి కిట్టు అలియాస్ వెంకటేశ్ చెల్లెలు ప్రియాంకను లింగంపల్లి లింగయ్య కొడుకు అనిల్ ప్రేమవివాహం చేసుకున్నాడు. కుటుంబం పరువు తీశారన్న కోపంతో లింగంపల్లి లింగయ్యపై వెంకటేశ్, అతని తండ్రి లింగంపల్లి రాజయ్య గొడ్డలితో దాడిచేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లింగంపల్లి రాజవ్వ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై మల్లేశ్‌గౌడ్ కేసు నమోదు చేశారు. సీఐ విజయ్‌కుమార్ నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రేమలత కిట్టు అలియాస్ వెంకటేశ్‌కు యావజ్జీవ శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా, లింగంపల్లి రాజయ్యకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. మిగతా వారిపై కేసు కొట్టేశారు. కేసు నిరూపణలో కృషి చేసిన పోలీస్ అధికారులను, ప్రాసిక్యూషన్ సమయంలో సహకరించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు తిరుపతి, లతీఫ్, కానిస్టేబుల్ నరేందర్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

బండిపెల్లి బాలరాజు మృతి తీరనిలోటు



నివాళి అర్పిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

కరీంనగర్: సీపీఐ సీనియర్ నాయకుడు, రిటైర్ ఆర్టీసీ ఉద్యోగి బండిపెల్లి బాలరాజు మృతి పార్టీకి, ఆయన కుటుంబానికి తీరనిలోటని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. బాలరాజు కుటుంబాన్ని శుక్రవారం వారి ఇంటికి వెళ్లి, పరామర్శించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బెజ్జంకి మండలం పాపన్నపల్లికి చెందిన బాలరాజు ఆ ప్రాంతంలో సీపీఐ బలోపేతానికి కృషి చేశారన్నారు. కుటుంబ పోషణ నిమిత్తం ఆర్టీసీలో చేరి, ఉద్యోగరీత్యా అంచెలంచెలుగా ఎదిగారని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు. నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బూడిద సదాశివ, నాయకులున్నారు.

రోడ్డు ప్రమాదంలో 102 పైలట్ దుర్మరణం



వెంకటేశ్ (ఫైల్)

మానకొండూర్: ఓ కారు ఢీకొన్న ఘటనలో 102 వాహన పైలట్ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి పంచాయతీ పరిధి లస్మయ్యపల్లికి చెందిన దాసరి వెంకటేశ్(31) 102 వాహన పైలట్‌గా కరీంనగర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి డ్యూటీ ముగించుకొని, శుక్రవారం ఉదయం బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఈదులగట్టెపల్లి శివారులోని కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై కరీంనగర్ వైపు వేగంగా వెళ్తున్న ఓ కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని, మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

కుక్క దాడిలో చిన్నారికి గాయం



చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో శుక్రవారం కుక్క దాడిలో ఓ చిన్నారికి గాయమైంది. సెలవులు కావడంతో కదారి గంగరాజు కూతురు ఇంటి వద్ద తన స్నేహితులతో ఆడుకుంటోంది. అటుగా వచ్చిన కుక్క పాప కాలిపై కొరకడంతో గాయమైంది. మిగతా పిల్లలు కేకలు వేయడంతో పారిపోయింది. కుటుంబసభ్యులు ఆ చిన్నారికి స్థానికంగా చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, అధికారులు స్పందించి, వాటిని దూరంగా తరలించాలని గంగరాజు కోరాడు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డలో ఉంటున్న ఓ వివాహిత చికిత్స పొందుతూ చెందింది. కరీంనగర్ టూటౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్‌కు చిగురుమామిడి మండలంలోని బోయినపల్లికి చెందిన శ్రీదేవి(33తో 15 సంవత్సరాల కింద వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీదేవి ఆరు నెలలుగా విడిగా కరీంనగర్‌లో అద్దెకు ఉంటోంది. ఆమె అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ఈ నెల 11న రాత్రి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే సీఎం ధ్యేయం

- అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించాలి
- ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న విప్ కౌశిక్‌రెడ్డి

వీణవంక(హుజూరాబాద్): అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. వీణవంక మండలంలోని రెడ్డిపల్లి, శ్రీరాములపేట, కొండపాక, హిమ్మత్‌నగర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో తనను ఈసారి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఆశీర్వదించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి, ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని పేర్కొన్నారు. ఘన్ముక్కుల గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 70 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. ఎంపీటీసీ సభ్యురాలు నల్ల మమత, సర్పంచ్ పోతుల నర్సయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పరిపాటి రవీందర్‌రెడ్డి, మాడ సాదవరెడ్డి, గంగాడి తిరుపతిరెడ్డి, ముసిపట్ల తిరుపతిరెడ్డి, జున్నూతుల మల్లారెడ్డి, కాంతాల రాజిరెడ్డి, కాసర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌టీపీ పోటీ

- పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్



చొప్పదండి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌టీపీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ అన్నారు. శుక్రవారం చొప్పదండిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెలలో జరిగే శాసనసభ ఎన్నికల్లో తమ అధినేత్రి వైఎస్ షర్మిలా రెడ్డి నాయకత్వంలో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని తెలిపారు. కరీంనగర్ నుంచి తాను పోటీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత ఉందన్నారు. వ్యతిరేక ఓటు చీలకుండా కాంగ్రెస్‌తో కలిసి వెళ్లేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ఒంటరిగానే సత్తా చాటుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్రంలో 3,800 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన వైఎస్ షర్మిలా రెడ్డి ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో కీలక పాత్ర పోషించనున్నారని తెలిపారు. జిల్లాలో మెజారిటీ స్థానాలు గెలుచుకుంటామన్నారు.

'శ్రీచైతన్య' ఫార్మసీ అధ్యాపకుడికి డాక్టరేట్



రవీందర్‌రెడ్డిని అభినందిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని శ్రీచైతన్య ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు మామిడాల రవీందర్‌రెడ్డికి జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసిందని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ వేణుఅపర్ణ, సోలోమన్ సుందర్‌రాజ్ ఆధ్వర్యంలో ×మల్టీ కాంపోనెంట్ వన్ పాట్ సింథసిస్ ఆఫ్ నోవెల్ డీ హైడ్రో పిరమిడిన్ డెరివేటివ్స్ ఆస్ పాసిబుల్ బయోలాజికల్ ఏజెంట్స్ అనే అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ పొందారు. సమాజానికి ఉపయోగపడే విధంగా రవీందర్‌రెడ్డి యాంటీ బ్యాక్టీరియల్, (యాంటీ యాక్సిడెంట్, యాంటీ అల్సర్ అండ్ యాంటీ డయాబెటిక్ మొదలగు ఆక్టివిటీస్ పైన సుదీర్ఘమైన పరిశోధన చేశారన్నారు. పదమూడేళ్ల బోధనా అనుభవం, ప్రముఖ అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆరు ఆర్టికల్స్ పబ్లిష్ చేశారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రామ నరసింహారెడ్డి మాట్లాడుతూ... రవీందర్‌రెడ్డి మరింత ఉత్సాహంతో, విద్యాబోధన చేస్తూ విద్యార్థుల ప్రతిభకు తోడ్పడాలని కోరారు. ప్రొఫెసర్ అప్పారావు, పాలనాధికారి పారువెల్ల రామారావు, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేశ్ తదితరులు రవీందర్‌రెడ్డిని అభినందించారు.

వ్యవసాయ వ్యర్థాల విక్రయంతో ఆదాయం

- ఎన్‌పీటీఐ నాగపూర్ డైరెక్టర్ సురేందర్‌కుమార్
- కేవీకేలో జీవ ఇంధనంపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న డైరెక్టర్ సురేందర్‌కుమార్

జమ్మికుంట(హుజూరాబాద్): వ్యవసాయ వ్యర్థాలతో జీవ ఇంధనం(బయోమాస్) తయారు చేయవచ్చని, వాతవరణ కాలుష్యం తగ్గించవచ్చని ఎన్‌పీటీఐ(నేషనల్ పవర్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్) నాగపూర్ డైరెక్టర్ సురేందర్‌కుమార్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని కేవీకేలో వ్యవసాయ వ్యర్థాల నుంచి జీవ ఇంధనం తయారీపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ వ్యర్థాలను గుళికల రూపంలో అందిస్తే థర్మల్ పవర్ ప్లాంట్లలో బయోమాస్ తయారీకి ఉపయోగపడుతుందని తెలిపారు. వాటి విక్రయం ద్వారా ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. ఎన్‌పీటీఐ నాగపూర్ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(థర్మల్) మెంబర్ ప్రవీణ్ గుప్తా, డైరెక్టర్ జనరల్ త్రిప్తా ఠాకూర్, ప్రిన్సిపాల్ డైరెక్టర్ ఆర్.కె.మిశ్రాలు థర్మల పవర్ ప్లాంటులో బయోమాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. కేవీకే ప్రధాన కార్యదర్శి విజయగోపాల్‌రెడ్డి, ఎన్‌టీపీఐ డిప్యూటీ డైరెక్టర్ సంజయ్ సింగ్, బయోమాస్ మిషన్ సమర్థ్ మెంబర్ ఎండీ.నిజాముద్దీన్, షణ్ముగం, శ్యాంసుందర్, సంతోశ్‌కుమార్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్ రావు, డీఏవో వాసిరెడ్డి శ్రీధర్, పీడీ ఆత్మ పియదర్శిని, ఎఫ్‌పీవో రైతులు, ఇన్‌పుట్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడాలి



మాట్లాడుతున్న సత్తయ్యగౌడ్

రామగుండం: ప్రభుత్వాలు గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్య గౌడ్ కోరారు. శుక్రవారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గీత కార్మిక సొసైటీకి ఈత, తాటిమొక్కల పెంపకానికి జీఓ.నెం.560 ప్రకారం పదెకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని, నీటి సౌకర్యం కల్పించాలని, కార్మికుడు మృతిచెందితే రూ.పది లక్షలు, గాయపడితే రూ.ఐదు లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. బెల్ట్‌షాపులను మూసివేయించాలని, జిల్లా, మండల కేంద్రాల్లో నీరా కేఫ్‌లు ఏర్పాటు చేసి గీత సొసైటీలకు అప్పగించాలని, వ్యవసాయ సహకార పరపతి సంఘాల మాదిరిగా గీత సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సైదాపూర్ గుట్టల సంపద విస్తరించిన కరీంనగర్, హన్మకొండ, సిద్దిపేట అటవీ సహజ సంపద కాపాడాలని విన్నవించారు. ప్రతినిధులు సంపునూరి మల్లేశంగౌడ్, కోల లక్ష్మణ్‌గౌడ్, మూల మల్లేశంగౌడ్, బూర్గు రాజేశంగౌడ్, ఎం.బాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం అభిషేకం



అభిషేకం చేస్తున్న పండితులు

మంథని: స్థానిక శ్రీబిక్షేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. పట్టణంలో ఐదు ప్రధాన శివాలయాలు ఉన్నాయి. అమావాస్యకు ముందువచ్చిన మాసశివరాత్రి సందర్భంగా శ్రీబిక్షేశ్వర స్వామి ఆలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దక్షిణ భారతదేశంలోని పశ్చిమ ముఖద్వారం కలిగిన ఏకైక శివాలయంగా బిక్షేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. లోకకల్యాణార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వేదపండితులు తెలిపారు. ఓజ్జల గణేశ్‌శర్మ, నల్లగొండ వెంకన్నశర్మ, శ్రీరాంభట్ల ఆదిత్యశర్మ, రంగి రాజన్నశర్మ, పల్లి సంజీవ్‌శర్మ, మహావాది విజయకుమార్‌శర్మ, తనువుల శ్రీవత్సవశర్మ, మహావాది శివకుమార్‌శర్మ, డింగిరి హరిశర్మ, దహగం త్రయంబక్‌శర్మ, నచ్చగారి సృజన్‌శర్మ, యజ్ఞంపట్ల శ్రీకాంత్‌శర్మ, డింగిరి అభిరాంశర్మ, రామ్‌చరణ్‌శర్మ పాల్గొన్నారు.

గీత కార్మికుడి మృతి

మంథని: గుంజపడుగు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొండ్ర సతీశ్ శుక్రవారం మృతి చెందాడు. ఈనెల 4న ఈతచెట్టు పైనుంచిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెన్నుముక సమస్య తీవ్రం కావడంతో చికిత్స చేయించుకొని ఇంటికి చేరాడు. శుక్రవారం హఠాత్తుగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

నీట్-యూజీ సిలబస్ కుదింపు

నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ
- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్ కట్...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్ తగ్గించలేదు, కానీ సబ్ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్ టాపిక్స్ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్ యూజీ సిలబస్ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్ విద్యార్థుల కన్నా, ఫస్టియర్ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

తొలగించిన పాఠ్యాంశాలు
- **కెమిస్ట్రీ ఫస్టియర్:** పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్ బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ.
- **కెమిస్ట్రీ సెకండియర్:** ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- **ఫిజిక్స్ ఫస్టియర్:** ప్యూర్ రోలింగ్, కనెక్టింగ్ బాడీలు, పాలిట్రోపిక్ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- **ఫిజిక్స్ సెకండియర్:** పొటెన్షియల్, నాన్ పొటెన్షియల్ సంభావ్యత, ప్రొటెన్షియో మీటర్, ఎర్త్ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

జువాలజీ యూనిట్-2: వానపాములు, యూనిట్-5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్-10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్ధకం.
బోటనీ ఫస్టియర్: ప్లాంట్ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
బోటనీ సెకండియర్: స్ట్రాటజీస్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్.
బోటనీలో కొత్తగా చేర్చినవి: బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్వేస్, లెగుమనీస్ సహా మరికొన్ని అంశాలు.

ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది

సిలబస్ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే. – శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ

● బోనాలపై భారీ చిత్రం
1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం



ఆత్మకూరు(ఎం): తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్

- పాత కేసులో రాజస్తాన్ పోలీసుల లుక్‌అవుట్ నోటీస్
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



శంషాబాద్: రాజస్తాన్ పోలీసుల లుక్‌ఔట్ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్క డి పోలీసులు లుక్‌ఔట్ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

కొన ‘ఊపిరి’ నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్
- యశోద ఆస్పత్రి ఘనత

రాంగోపాల్‌పేట్: విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్ లంగ్స్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మర్రాయిగూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్ వెంటిలేటర్స్ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్ చొరవతో ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్, థొరాసిక్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కేఆర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ మంజునాథ్ బాలే, డాక్టర్ చేతన్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్ పలివాల్ వినూత్న కృషి..షార్ట్ ఫిల్మ్‌ను షేర్ చేసిన ఎంపీ సంతోష్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్ సుందర్ పలివాల్ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్ కుమార్ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్ ఆఫ్ ఎకో ఫెమినిస్ట్‌గా పేరొందిన శ్యాంసుందర్ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్ పలివాల్ కృషిలో భాగస్వామ్యమైన ఆస్ట్రల్ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌ను ఎక్స్(ట్విట్టర్)లో సంతోష్ కుమార్ షేర్ చేస్తూ పలివాల్ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విమలక్కకు ‘సుద్దాల’ పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి. చిత్రంలో ఆర్.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): ప్రజాగాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు– జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, ‘మోదుగుపూలు’ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

‘బీ థర్మల్’ మనుగడ ప్రశ్నార్థకం

- జీవితకాలం ముగిసి 25ఏళ్లు
- ఆధునికీకరణకు నోచాన్స్
- కొత్త ప్రాజెక్టు ఏర్పాటే ప్రత్యామ్నాయం

రామగుండం: 62.5 మెగావాట్ల సామర్థ్యం గల రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. విద్యుత్ కేంద్రాల జీవితకాలం పాతికేళ్లే అని జెన్‌కో డైరెక్టర్లు ఇటీవల స్పష్టం చేయడంతో అది కాలంచెల్లిన జాబితాలో చేరినట్లయ్యింది.

1965లో శంకుస్థాపన..
- రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్‌టీపీపీ)కి అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి 1965 జూలై 19న శంకుస్థాపన చేశారు.
- రూ.రూ.14.8 కోట్ల అంచనా వ్యయంతో చేట్టిన ఈ ప్రాజెక్టుకు జవహర్‌లాల్ నెహ్రూ థర్మల్ విద్యుత్ కేంద్రంగా నామకరణం చేశారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఇది తొలి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం.
- అయితే, స్థానికంగా వనరుల లభ్యత సమృద్ధిగా ఉండడంతో కొత్తగా 800 మెగావాట్ల సామర్థ్యం మరో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది.
- దీనిద్వారా నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకు ఉత్పత్తి చేసే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

కాలంచెల్లిన జాబితాలో..
- పర్యావరణ పరిస్థితుల దృష్ట్యా 200 మెగావాట్లలోపు 25 ఏళ్లపైబడి జీవితకాలం ఉన్న విద్యుత్ కేంద్రాలను కూల్చి, వాటిస్థానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అధికారాన్ని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి అప్పగించింది. దీంతో కొత్తగూడెంలో ఐదు యూనిట్లను ఇటీవల కూల్చివేసి కొత్తవి స్థాపించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఢిల్లీలోని సీఈఏ చైర్మన్‌ను ఇటీవల కలిశారు. బీ-థర్మల్‌ను సీఈఏ నామ్స్‌కు లోబడి విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని, పారామీటర్స్ అంశాలు వివరించారు. దీంతో సీఈఏ గడువు పొడిగించింది.



బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

తరచూ సాంకేతిక సమస్యలు..
- కాలంచెల్లిన ప్రాజెక్టు కావడంతో బాయిలర్ ట్యూబ్స్, మిల్స్, టర్బయిన్ విభాగాల్లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.
- ప్రతీసారి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతోంది.
- పునరుద్ధరణకు విడిభాగాలు లభ్యం కావడం లేదు.
- స్థానిక సాంకేతిక పరిజ్ఞానంతో పునరుద్ధరిస్తున్నా కొద్దిరోజులకే మళ్లీ సమస్యలు తలెత్తుతున్నాయి.
- విద్యుత్ కేంద్రం షట్‌డౌన్ తర్వాత మళ్లీ ఆయిల్ మండించి బాయిలర్ స్టార్టప్ చేసేందుకు సుమారు రూ.20లక్షల వ్యయం అవుతోంది.
- ఇలా ఏటా సుమారు 30సార్లు షట్‌డౌన్ కావడంతో పునరుద్ధరణకే రూ.కోట్లు వెచ్చించాల్సి వస్తోంది.

కొత్త విద్యుత్ కేంద్రం స్థాపనకు అనుకూలతలు..
- బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం తొలగించి, అదేస్థలంలో 500 మెగావాట్ల సామర్థ్యం గల కొత్త పరిశ్రమ ఏర్పాటు చేసే వీలుంది. ఇందుకు అవసరమైన స్థలం, ఇతర వనరుల లభ్యతపై నాలుగేళ్ల క్రితమే జెన్‌కో సర్వే చేసింది. మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి 0.7 ఎకరాలు అవసరమూతే.. 500 మెగావాట్ల ప్రాజెక్టుకు 350 ఎకరాలు(ఉద్యోగుల వసతి గృహాలతో కలుపుకొని)అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఏ- కాలనీ నుంచి సీ- కాలనీ అతిథి గృహం వరకు 44.5 ఎకరాలు, ఏ, బీ, సీ కాలనీలతోపాటు పెద్దచెరువు, విద్యుత్ కేంద్రం స్థలంతో కలుపుకొని 390 ఎకరాలు ఉన్నట్లు గుర్తించింది. వీటితో పాటు బూడిద చెరువు 127 ఎకరాలు, వాటర్ రిజర్వాయర్లు ప్లాంట్‌లోని ఖాళీ ప్రదేశాన్ని కలుపుకొని మరో 400 ఎకరాలు ఉన్నట్లు తేల్చారు. ఐదు వందల ఎకరాల విద్యుత్ కేంద్రానికి 100 ఎకరాల బూడిద చెరువు సరిపోతుందని, ప్రస్తుతం బూడిద చెరువు 125 ఎకరాల విస్తీర్ణంలో ఉందని నివేదిక రూపొందించింది.

కొత్తది స్థాపించాలి



బీ థర్మల్ విద్యుత్ కేంద్రం పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని, సాధ్యం కాకుంటే కొత్త పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇప్పటికే దీక్షలు చేశాం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.
– కౌశిక హరి, కార్మిక సంఘం ప్రతినిధి

అందుబాటులో వనరులు



ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి బీ–థర్మల్ స్థలంలో స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని కొత్త విద్యుత్ కేంద్రం స్థాపించాలి. తద్వారా రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగవించవచవచ్చు. – కన్నూరి సతీశ్‌కుమార్, విద్యుత్ కేంద్రం సాధన సమితి చైర్మన్

తక్కువ ధరకే అందుబాటులోకి..
స్థానికంగా నీరు, బొగ్గు అందుబాటులో ఉంది. దీంతో రవాణా ఖర్చు తగ్గుతుంది. తద్వారా విద్యుత్ తక్కువ ధరకే లభ్యమవుతుంది. దీనిమీపంలోనే ఓపెన్‌కాస్టు బొగ్గు గనులు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా నీరు, విద్యుత్ కేంద్రం లోపలి వరకు ఇప్పటికే రోడ్డు, రైలు మార్గం.. ఇలా అన్నీ అనుకూలంగా ఉన్నాయి. తద్వారా నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి సాధ్యమని ఇంజినీర్లు చెబుతున్నారు.

ముస్తాబైన రాజన్న ఆలయం

వేములవాడ: రాజన్న ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



చకచకా శరన్నవరాత్రి ఏర్పాట్లు

- ముస్తాబైన బాసర ఆలయం
- బారికేడ్లు ఏర్పాటుచేస్తున్న సిబ్బంది
- ఆలయం ముందు మొరం పోయిస్తున్న అధికారులు
- కోనేరు శుద్ధి చేయాలంటున్న భక్తులు
- రేపటి నుంచే శరన్నవరాత్రి ఉత్సవాలు

భైంసా: బాసరలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. దసరా వరకు కొనసాగే ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆహ్వానాలు పంపించారు. ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ పెద్దలకు ఆలయ అర్చక బృందం ఆహ్వానాలు ఇచ్చి ఉత్సవాలకు రావాలని కోరారు. ఇక యేట బాసరలో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు లక్షలాది భక్తులు వస్తుంటారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి ఆలయంలో అక్షరాభ్యాసాల సంఖ్య అధికంగా ఉంటుంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఈయేడు కూడా ఆలయ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు దొర్లకుండా, భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

క్యూలైన్లు ఏర్పాట్లు...
బాసర ప్రధాన ద్వారం, ఆలయం, ఆలయ ప్రాంగణం, పరిసరాలు, వేదవ్యాస గుడి ఇలా అన్ని చోట్ల ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. టీటీడీ సత్రం నుంచే స్వాగతతోరణం ఏర్పాటుచేసి క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అక్షరాభ్యాసాలు జరిపించి బయటకు వచ్చే భక్తులకు ఇక్కట్లు లేకుండా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

మొరం వేసి...
వసతిగృహాలు, ప్రసాద కౌంటర్‌కు మధ్య బండ రాళ్ల గుట్ట ఉండేది. కొన్ని రోజులుగా ఈ పనులను పూర్తిచేసి బండరాళ్లు తొలగించేశారు. వచ్చే భక్తులకు ఇక్కట్లు లేకుండా ఇక్కడ టిప్పర్లతో మొరం వేయించి చదును చేయిస్తున్నారు.



బాసర ఆలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు



రాళ్లు తొలగించి మొరం పోస్తున్న దృశ్యం

రంగుమారిన కోనేరు నీరు...
బాసర ఆలయానికి ఆనుకుని కోనేరు ఉంది. వ్యాస మహర్షి ఆలయం బాసర సరస్వతీ ఆలయం మధ్య ఈ కోనేరు కనిపిస్తుంది. చుట్టూ గార్డెన్ ఉండడంతో కోనేరు ఉందన్న విషయం తెలియడంలేదు. 20 ఏళ్ల క్రితం బాసర వచ్చేవారంతా ఈ కోనేరులోనే స్నానాలు చేసేవారు. రానురాను కోనేరు మార్గం మూసి పచ్చని గడ్డి, చెట్లు పెంచారు. వచ్చిన భక్తులంతా నేరుగా ఆలయానికే వెళ్తున్నారు. గతంలో ఈ కోనేరులో దిగి ఇక్కడే నెత్తిపై నీళ్లు చల్లుకుని అమ్మవారి దర్శనానికివెళ్లేవారు. కోనేరు నిర్వాహణ లేక అందులో నీరంతా రంగుమారింది. దగ్గరికి వెళ్లితే పచ్చని రంగుతో కనిపించే నీటి నుంచి దుర్వాసన వస్తుంది. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కోనేటిని శుద్ధిచేయాలని భక్తులు కోరుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం
బాసర ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖులకు ఆహ్వానాలు అందించి బాసర రావాలని కోరాం. బాసర వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. బాసర ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాం.
– విజయరామారావు, ఆలయ ఈవో

గోదావరి వద్ద...
బాసర గోదావరి నది వద్ద ప్రధాన స్నానఘట్టాలు ఇప్పుడిప్పుడే శుభ్రంచేస్తున్నారు. ఈయేడు గోదావరి నదిలో వరదనీటిలో నల్లమట్టి బాగా చేరింది. బాసర వంతెన నుంచి సూర్యేశ్వర స్వామి ఆలయం వరకు విశాలంగా ఉన్న స్నానఘట్టాల్లో అంతా స్నానాలుచేస్తారు. నల్లమట్టిలో కాలుజారి నీటిలో పడిపోతున్నారు. అధికారులు ఈ విషయంపై స్పందించి పూర్తిగా నల్లమట్టి తొలగించిన ఘాట్‌ల వద్దే స్నానాలుచేసేలా భక్తులకు సూచనలు ఇవ్వాలి.

ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక వివాదం

- ఎన్నిక చెల్లదన్న ‘పత్తిరెడ్డి’ పిటిషన్‌పై హైకోర్టు విచారణ
- సంతకాల ఫోర్జరీపై ఫోరెన్సిక్ నివేదికకు ఆదేశం

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక వివాదం కొనసాగుతోంది. ఈ ఎన్నిక చెల్లదని నిర్మల్ జిల్లాకు చెందిన పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు ఫోర్జరీ పత్రాలు సృష్టించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. శుక్రవారం విచారణకు రాగా.. ఆ పత్రాలపై సంతకాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పోల్చి నివేదిక ఇవ్వాలని రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. 2021 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 24మంది నామినేషన్లు వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా విఠల్ నిలువగా, బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పార్టీ ఆదేశాలను ధిక్కరించి నామినేషన్ వేశారు. ఉపసంహరణ రోజు 22 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. తుడుందెబ్బకు చెందిన పెందూర్ పుష్పరాణి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. పోలింగ్ తర్వాత భారీ ఆధిక్యంతో విఠల్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికపై పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో విచారణ కొనసాగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పత్రాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని హైకోర్టు ఆదేశించింది. ఆ సంతకాలను పోల్చి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. తాజా పరిణామాలు రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నాయి.

‘కడెం’ను సందర్శించిన జీఆర్‌ఎంబీ అధికారులు



కడెం ప్రాజెక్ట్ వద్ద అధికారులు

కడెం: కడెం ప్రాజెక్ట్‌ను గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్‌ఎంబీ) కార్యదర్శి అరిగేషణ్, ఈఈ బత్తుల వెంకటస్వామి శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్ట్ అండర్ గ్రౌండర్ గేట్‌లను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించామని తెలిపారు. ప్రాజెక్ట్ నీటి మట్టం, ప్రధాన సమస్యలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈఈలు రవికుమార్, సర్వార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.